
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
సోమవారం 8 జనవరి 2024
3





ప్రథమ బహుమతి గెలుచుకున్న అర్షం సింధుకు రూ.6 వేల నగదు, మెమెంటోను అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, దాత స్టార్‌హెల్త్ ఇన్సూరెన్స్ ఎస్ఎస్ఎం నాళ్ల ఓంప్రకాష్-నీరజ దంపతులు



మహబూబాబాద్ పట్టణంలో ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి



మానుకోటలోని సమైక్య జూనియర్ కళాశాలలో ముగ్గులు వేస్తున్న మహిళలు

తారే జమీన్ పర్..

మానుకోటలో ముందే సంక్రాంతి ముగ్గుల పండుగ

- రంగురంగుల రంగవల్లులతో మురిసిన అవని
- ఘనంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న జిల్లా మహిళలు
- ప్రథమ బహుమతి సింధు, ద్వితీయ బహుమతి విజిత, తృతీయ బహుమతి విజయలక్ష్మి

మహబూబాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ధరణి మురిసింది.. చుక్కల ముగ్గులతో మెరిసింది. రంగు రంగుల రంగవల్లులతో అవని కళకళలాడింది.. మానుకోట జిల్లా కేంద్రంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్, పవర్డ్ బైఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగుళూరు, రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు పండగ శోభను తలపించాయి. జిల్లా నలుమూలల నుంచి మహిళలు పెద్దఎత్తున తరలిరావడంతో ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది.

జిల్లా కేంద్రంలోని 'సమైక్య జూనియర్ కళాశాల' ఆవరణలో ఆదివారం ఉదయం 9.20 గంటలకు స్థానిక మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి హాజరై ముగ్గుల పోటీలను ప్రారంభించి, ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందించడం అభినందనీయమన్నారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి 72 మంది మహిళలు పాల్గొని, ఉత్సాహంగా రంగవల్లులను వేశారు. చుక్కల ముగ్గులకు ప్రాధాన్యతనిస్తూ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. దీంతో సమైక్య జూనియర్ కాలేజీ ప్రాంగణమంతా ముందే సంక్రాంతి పండుగ శోభను సంతరించుకుంది. ఆ కాలేజీ ప్రాంగణం రంగవల్లులతో కళకళలాడింది. ఈ పోటీలను పురస్కరించుకొని కళాశాల నిర్వాహకులు పండుగ వాతావరణాన్ని తలిపించేలా ప్రత్యేక షామీయానాలతో అలంకరించారు.

విజేతలు వీరే..

మహబూబాబాద్ పట్టణంలోని సమైక్య జూనియర్ కళాశాలలో జరిగిన ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతిని మానుకోటకు చెందిన ఎ.సింధు, ద్వితీయ బహుమతి టి.విజిత, తృతీయ బహుమతిని ఎం.విజయలక్ష్మి కైవసం చేసుకున్నారు. మొదటి బహుమతిగా రూ.6 వేల నగదు, ద్వితీయ బహుమతిగా రూ.4 వేల నగదు, తృతీయ బహుమతిగా రూ.3 వేల నగదుతో పాటు జ్ఞాపికలను స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్-ఉమ దంపతుల చేతుల మీదుగా విజేతలకు అందజేశారు. ప్రథమ బహుమతి నగదును మహబూబాబాద్‌కు చెందిన స్టార్‌హెల్త్ ఇన్సూరెన్స్ సీనియర్ సేల్స్ మేనేజర్ (ఎస్ఎస్ఎం) నాళ్ల ఓంప్రకాష్-నీరజ దంపతులు, ద్వితీయ బహుమతి నగదును సమైక్య విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అడ్డగోడ కల్పన-నరేష్ దంపతులు, తృతీయ బహుమతి నగదును సమైక్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, కమటం కామధేను చిట్‌ఫండ్స్ చైర్మన్ కమటం రమేష్-విజయ దంపతులు అందించారు. మానుకోటకు చెందిన శ్రీబాలాజీ క్లాత్ స్టోర్స్ యాజమాని బొడ్ల శ్రీపాల్-పావని దంపతులు ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి కన్సోలేషన్ బహుమతిగా రూ.60 వేల విలువగల చీరలు, డ్రెస్ మెటీరియల్‌ను అందించారు. కెనరా బ్యాంక్ మానుకోట శాఖ తరుపున ప్రథమ విజేతకు రూ.1500, ద్వితీయ విజేతకు రూ.1000, తృతీయ విజేతకు రూ.500 చొప్పున మేనేజర్ శోభన్ అందించారు. న్యాయ నిర్ణేతలుగా ప్రభుత్వ ఉపాధ్యాయురాలు తేలుకుంట్ల సునిత, నాగబోయిన స్వప్న, ఇమ్మడి సునీతలు వ్యవహరించారు. కాగా కెనరా బ్యాంక్, ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన లోగోలను వేసిన చిన్నారులు అడ్డగోడ అక్షర, సరెడ్డి సాయిస్ఫూర్తిలకు గిఫ్ట్ హ్యాంపర్లను అందజేశారు.



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు టి.సునీత, ఎన్.స్వప్న, ఈ.సునీత

సంస్కృతికి, సంప్రదాయానికి నిలువుటద్దం ముగ్గులు..

ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

సంస్కృతీ, సంప్రదాయలకు నిలువుటద్దం ముగ్గులని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ అన్నారు. మహబూబాబాద్ సమైక్య జూనియర్ కళాశాలలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. సంస్కృతీ, సంప్రదాయాలు కనుమరుగు కాకుండా వాటిని కాపాడుతూ భావితరాలకు అందించేందుకు ఏటా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' కృషి అభినందనీయమన్నారు. రెడిమెడ్ ముగ్గులు వేసే ప్రస్తుత సమాజంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించి మహిళల్లో

మిగతా 6వ పేజీలో



మహబూబాబాద్‌లో ప్రథమ బహుమతి సాధించిన అర్షం సింధు వేసిన ముగ్గు



మహబూబాబాద్‌లో ద్వితీయ బహుమతి సాధించిన విజిత వేసిన ముగ్గు



మహబూబాబాద్‌లో తృతీయ బహుమతి సాధించిన విజయలక్ష్మీ వేసిన ముగ్గు

మృత్యువులోనూ వీడని బంధం

తమ్ముడి మరణాన్ని తట్టుకోలేక అక్క గుండెపోటుతో మృతి



ఎండీ ఇబ్రహీం, మోదీన్‌బీ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, జనవరి 7 : కన్నతల్లి కడుపులో పుట్టిన అక్కాతమ్ముళ్ల బంధం మృత్యువులోనూ వీడలేదు. తమ్ముడి మరణాన్ని తట్టుకోలేక అక్క గుండెపోటుతో హఠాన్మరణం చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా పర్వతగిరిలో చోటు చేసుకుంది. వివరాల్లో కెళ్తే. పర్వతగిరి గ్రామానికి చెందిన ఎండీ ఇబ్రహీం(72) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబసభ్యులు మూడ్రోజుల క్రితం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స నందిస్తున్నారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన పర్వతగిరికి తీసుకువచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఇబ్రహీం అక్క కడసారి తమ్ముడి మృతదేహం చూసేందుకు ఇబ్రహీం ఇంటికి వచ్చారు. తమ్ముడి మృతదేహం చూసి భావోద్వేగానికి గురైన అక్క షేక్.మోదీన్‌బీ (75) గుండెపోటుతో తమ్ముడి మృతదేహం వద్దనే కుప్పకూలింది. వెంటనే కుటుంబసభ్యులు ప్రైవేట్ వాహనంలో చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆస్పత్రిలో ఆమె కన్నుమూశారు. ఏడు పదుల వయస్సు దాటక కూడా అక్కతమ్ముడి ఆత్మీయ అనుబంధం గంటల వ్యవధిలోనే మృత్యువులోనూ ఆ బంధం వీడలేదు. పర్వతగిరిలో అక్కాతమ్ముడి మృతదేహాలను చూసిన ప్రతీ ఒక్కరు కంటతడి పెట్టారు. మృతుడు ఇబ్రహీంకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలు షేక్.మోదీన్‌బీకి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారి మృతదేహాల వద్ద మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ నివాళ్లర్పించారు. ఎమ్మెల్యే వెంట నాయిని రంజిత్, అశోక్‌నాయక్, సుదగాని మురళి, సునిత, మార్నేని రఘు, వెంకన్న ఉన్నారు.

కిక్కిరిసిన మేడారం

వనదేవతలకు ముందస్తు మొక్కులు

మేడారం, జనవరి 7 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క, సారలమ్మ వనదేవతలకు భక్తులు ముందస్తు మొక్కులు చెల్లిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు లక్షకు పైగా భక్తులు ఆదివారం తరలివచ్చారు. తల్లుల గద్దెల వద్ద పూలు, పండ్లు, చీరె,సారె, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగు పుణ్యస్నానాలు సమర్పించి కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించారు. అనంతరం గద్దెల వద్దకు చేరుకుని సమ్మక్క- సారలమ్మలకు జేజేలు పలుకుతూ శివసత్తు పూనకాలతో బాజా బజంత్రీలతో తల్లుల గద్దెలకు చేరుకున్నారు. అందరిని చల్లగా చూడాలని వేడుకున్నారు.

మొక్కులు చెల్లించుకున్న బండ్ల గణేష్

మేడారం సమ్మక్క-సారలమ్మలను సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ కుటుంబ సమేతంగా దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు గిరిజన సంప్రదాయాల ప్రకారం డోలువాయిద్యాల నడుమ ఘనస్వాగతం పలికారు. అమ్మవార్లకు గణేష్ నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని వనదేవతలను కోరుకున్నానని, తన ఆకాంక్ష నెరవేరడంతో మొక్కులు చెల్లించుకున్నారని తెలిపారు.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

దర్శించుకున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా

మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ మేడారం వనదేవతలను దర్శించుకున్నారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీర, కొబ్బరికాయలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క-సారలమ్మల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

బీఆర్ఎస్‌కు జడ్పీటీసీ రాజీనామా

- మాజీ ఎమ్మెల్యే రెడ్యాపై తీవ్ర విమర్శలు
- నియోజకవర్గంలో తిరిగే నైతిక హక్కు ఆయనకు లేదు
- అభివృద్ధి, మనోభావాలను గౌరవించే వారికి మద్దతిస్తాం
- జడ్పీటీసీ సునిత మురళీధర్‌రెడ్డి



రాజీనామా పత్రాన్ని చూపుతున్న జడ్పీటీసీ దంపతులు

చిన్నగూడూరు, జనవరి 7 : తనను నమ్ముకున్న కార్యకర్తలకు, ప్రజలకు న్యాయం చేయలేమని, వారి సమక్షంలో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవితకు ఆ పత్రాన్ని పంపినట్లు స్థానిక జడ్పీటీసీ మూల సునిత మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గుండంరాజుపల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ తన రాజకీయ లబ్ధికోసం ఎంతోమందిని అణగతొక్కారని ఆరోపించారు. కష్టపడి పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను మరిచి, అక్రమ వ్యాపారస్తులకు భరోసాగా నిలిచారని విమర్శించారు. ఉగ్గంపల్లి సర్పంచ్ అప్పులపాలై ఎకరం భూమి అమ్ముకున్నప్పుడే రెడ్యా నైతికంగా ఓడారని, డోర్నకల్ నియోజకవర్గంలో తిరిగే నైతికహక్కు ఆయనకు లేదని అన్నారు. మండలకేంద్రంలో నిర్మించిన 81 డబుల్ బెడ్రూం ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా ఎందుకు ఆపారని ప్రశ్నించారు. ఆయనే ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి అనే నియంత పాలన రెడ్యానాయక్‌ది అని, ప్రజాస్వామ్యంలో ఎవరూ తిరుగొద్దా, డోర్నకల్ నియోజకవర్గాన్ని రెడ్యాకు రాసిచ్చారా అని మండిపడ్డారు. గ్రామాన్ని అభివృద్ధి చేస్తూ తమ మనోభావాలకు గౌరవించే వారికి మద్దతిస్తామని స్పష్టం చేశారు. మండల ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సర్పంచ్ సలీమాగం గన్న, ఎంపీటీసీ మమతశ్రీను, ఐలయ్య, గ్రామస్థులు ఉన్నారు.

'ఆన్‌లైన్' ప్రక్రియ వేగవంతంగా జరగాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్ టౌన్, జనవరి7 : 'ప్రజాపాలన' దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమంలో 'అభయ హస్తం' కిందఅమలు చేయబోయే పథకాల మంజూరు కోసం ప్రజలు సమర్పించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రగతిపై ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన గడువులోగా దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిన చోట ఉన్న సిబ్బందిని దరఖాస్తులు ఎక్కువగా ఉన్నచోట ఏర్పాటు చేసి నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియను ఆకస్మికంగా పర్యవేక్షణ చేపడుతామన్నారు. అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతంగా చేపట్టేలా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, జిల్లా అధికారులు సన్యాసయ్య, ఖుర్షీద్, నర్సింహాస్వామి, రామారావు, సూర్యానారాయణ, రమాదేవి, మానుకోట ఆర్డీవో అలివేలు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్, జనవరి 7 : ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం తొర్రూరు పట్టణంలోని ఎల్‌వైఆర్ గార్డెన్స్‌లో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమారపు ఐలయ్య అధ్యక్షతన జరిగిన తొర్రూరు జోనల్‌స్థాయి విద్యాసదస్సుకు ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. సమాజంలో పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల శ్రేయస్సు, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఏకైక ఉపాధ్యాయ సంఘం టీపీటీఎఫ్ (తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్) అన్నారు. ఉపాధ్యాయులు నిబద్ధతో పాటు సామాజిక బాధ్యతలను తన బాధ్యతగా తీసుకొని ప్రజాసమస్యల పట్ల పోరాడడం అభినందనీయమని అన్నారు. ముఖ్యవక్త ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ 'భారత రాజకీయాలు' అనే అంశంపై మాట్లాడుతూ ఎన్నికల కమిషన్, న్యాయ వ్యవస్థలు రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా తమ స్వయంప్రతిపత్తితో పని చేయాలన్నారు. అప్పుడే విలువలను, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు నర్సింహరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ రామచంద్రయ్య, నోడల్ ఆఫీసర్ మహంకాళి బుచ్చయ్య, రాష్ట్ర కార్యదర్శి కవిత, జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఆయా మండలాల అధ్యక్ష కార్యదర్శులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యశస్విని రెడ్డి


తాటిచెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తాటి చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

హసన్‌పర్తి శివారులో 19 మందికి గాయాలు


గాయపడ్డ ప్రయాణికులను 108 ద్వారా ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

హసన్‌పర్తి, జనవరి 7: అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు తాటి చెట్టును ఢీ కొన్న సంఘటన ఆదివారం రాత్రి హసన్‌పర్తి శివారులో జరిగింది. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ డిపోకు చెందిన బస్సు వరంగల్ నుంచి సిరిసిల్లకు వెళుతోంది. బస్సులో 55 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు హసన్‌పర్తి శివారులో ఉన్న రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయింది. అదుపు తప్పిన బస్సు రోడ్డు.. పక్కనే ఉన్న తాటి చెట్టును ఢీ కొంది. దీంతో అందులో ప్రయాణిస్తున్న 19 మందికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, సబ్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌లు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డవారికి ప్రథమ చికిత్స చేసి, 108 ద్వారా మెరుగైన చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంగ్లీష్‌లో కవితకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, జనవరి 7: కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం పరిశోధకురాలు ఎస్.కవితకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఆదివారం కవితకు డాక్టరేట్ ప్రకటించినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 'థీమ్ ఆఫ్ డయాస్ పోరా ఇన్ ది నవెల్స్ ఆఫ్ అనిత రావ్ బాదమీ' అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానిగాను డాక్టరేట్ ప్రకటించారు. కేయూ ఇంగ్లీష్ విభాగం ప్రొఫెసర్ వి. శ్రీనివాస్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. హనుమకొండ వడ్డెపల్లి ప్రభుత్వ మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో ఇంగ్లీష్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తారు.

ప్రభుత్వ పాలన శాస్త్రంలో శంకర్‌కు..

కాకతీయ యూనివర్సిటీ ప్రభుత్వ పాలన శాస్త్రం పరిశోధకుడు నిమ్మన గోటి. శంకర్‌కు డాక్టరేట్ లభించింది. 'ఇంప్లిమేంటేషన్ ఆఫ్ వెల్ఫేర్ మేజర్స్ అండ్ రెహబిలిటేషన్ స్కీమ్స్ ఫర్ విజుల్లీ డీస్ాబ్లెడ్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానిగాను డాక్టరేట్ ప్రకటించారు. కేయూ ప్రభుత్వ పాలనశాస్త్రం ప్రొఫెసర్ పింగళి నర్సింహరావు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం పరడ గ్రామానికి చెందిన శంకర్ కేయూలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ద్విచక్రవాహనం చోరీ

హనుమకొండ క్రైం, జనవరి 7: హనుమకొండ పోలీసుస్టేషన్ పరిధిలోని లష్కర్ సింగారంలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మస్సి తండాకు చెందిన బానోతు బాలాజీ హనుమకొండ లష్కర్ సింగారంలో ఉంటూ దినసరి కూలీగా పని చేస్తున్నాడు. ఆదివారం లష్కర్ సింగారంలోని ఇంటి ముందు పార్కింగ్ చేసి బయటకు వెళ్లి వచ్చాడు. ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ కనిపించకుండా పోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.


దామెర మండల కేద్రంలో వేలిముద్రలు తీసుకుంటున్న రేషన్ డీలర్ (ఫైల్)

ఈ- కేవైసీకి నెలాఖరు గడువు

రేషన్ దుకాణాలకు పరుగులు.. కొనసాగుతున్న ప్రక్రియ

హనుమకొండ రూరల్, జనవరి 7: రేషన్ కార్డులోని కుటుంబ సభ్యులకు ఈ-కేవైసీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 31వ తేదీ వరకు ప్రభుత్వం గడువు విధించింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. రేషన్‌కార్డు లబ్ధిదారులందరి వేలిముద్రలు సేకరించాలని రేషన్ డీలర్లకు ఆదేశాలు రావడంతో ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. రేషన్‌కార్డు ద్వారా పొందే బియ్యం దుర్వినియోగం అవుతున్నట్లు ప్రభుత్వాల దృష్టికి రావడంతో ఈ కేవైసీ తప్పనిసరి చేస్తూ ఆదేశించినట్లు తెలుస్తోంది. రేషన్‌కార్డులో పేరున్న ప్రతీ ఒక్కరు ఈ-పాస్ యంత్రాల ద్వారా వేలిముద్రలు డీలర్లు సేకరిస్తున్నారు. ఈ-కేవైసీ చేసుకోకుంటే బియ్యం ఇవ్వరనే వదంతులు వ్యాపించడంతో పెద్దఎత్తున రేషన్ దుకాణాలకు పరుగులు పెట్టారు. రేషన్ డీలర్లు బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు సేకరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 73శాతం ఈ- కేవైసీ పూర్తయినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

రేషన్ దుకాణాలకు పరుగులు

ఈ-కేవైసీ ఈనెల 31వ తేదీతో ముగుస్తుండటంతో ప్రజలు రేషన్ దుకాణాలకు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికే చాలా మంది వేలిముద్రలు ఇవ్వగా.. ఇంకా ఇవ్వని వారు గడువు సమీపిస్తుండటంతో ఎలాగైనా ఈ-కేవైసీ చేయించుకోవాలనే ఉద్దేశంతో రేషన్‌దుకాణాల ముందు వేచి ఉంటున్నారు. రేషన్ కార్డుల్లోని చిన్నారులకు ఆధార్‌కార్డు లేకపోవడంతో ఆధార్ నమోదు సెంటర్లకు పరుగులు తీస్తున్నారు.

ఈ- కేవైసీ 73శాతం పూర్తి

హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 414 రేషన్ దుకాణాలు ఉండగా రేషన్ కార్డులు 2,28,143 ఉన్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డులు 2,16,767, అంత్యోదయ కార్డులు 11352, అన్నపూర్ణ కార్డులు 24 ఉన్నాయి. మొత్తం 6,75,550 లబ్ధిదారులు ఉండగా ఇందులో ఇప్పటి వరకు 4,92,693 మంది మాత్రమే ఈ-కేవైసీ చేయించుకున్నారు. ఇంకా 1,82,857 మంది రేషన్ కార్డుదారులు ఈ- కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు 73శాతం మంది ఈ- కేవైసీ చేయించుకున్నారు. మిగతావారు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని రేషన్ డీలర్లకు అధికారులు ఆదేశాలు ఇచ్చారు.

రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ చేసుకోవాలి :
జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పి.వసంతలక్ష్మీ

జిల్లాలోని రేషన్ కార్డుదారులు విధిగా ఈ-కేవైసీ చేసుకోవాలి. పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీ వరకు ఇవ్వడం జరిగింది. రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ సమీపంలోని రేషన్ దుకాణాలలో వేలిముద్రలు (ఈ-కేవైసీ) ఇవ్వాలి. ఇప్పటి వరకు ఈ-కేవైసీ చేసుకోని లబ్ధిదారులు నెలాఖరులోగా పూర్తి చేసుకోవాలి.

కేయూ ఉద్యోగి మృతిపై ఉద్రిక్తత


మధుసూదన్ (ఫైల్)

- బిల్లులు రాలేదని ఒత్తిడితో మృతిచెందాడని బంధువుల ఆరోపణ
- మృతదేహాన్ని వర్సిటీకి తరలించి నిరసన.. వీసీ హామీతో విరమణ

కేయూ క్యాంపస్, జనవరి 7: కాకతీయ యూనివర్సిటీ ఉద్యోగి మధుసూదన్ (49) గుండెపోటులో ఆదివారం మృతి చెందారు. రెండు రోజుల కిందట మధుసూదన్‌కు గుండెపోటుకు గురికాగా, హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతుండగానే పరిస్థితి విషమించి మృతిచెందాడు. దీంతో ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎస్. వాసుదేవారెడ్డి, ప్రొఫెసర్ బన్న అయిలయ్య, ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, డాక్టర్ ఎం.తిరుమలదేవి, డాక్టర్ మామిడాల ఇస్తారీలు హనుమకొండలోని పాత ఆర్టీవో ఆఫీస్ ప్రాంతంలో ఉన్న మృతుడి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉద్రిక్తత

మధుసూదన్ వర్సిటీలో ఉద్యోగం చేస్తూనే ఇటీవల కేయూ న్యాక్ పనుల్లో భాగంగా వర్సిటీకి కావాల్సిన ఫ్లెక్సీలు, ఇతర పనులు చేశారు. ఆయా బిల్లులు సుమారు రూ.20లక్షల మేరకు వర్సిటీ మధుసూదన్‌కు చెల్లించాల్సి ఉంది. అయితే రోజులు గడుస్తున్నప్పటికీ వర్సిటీ అధికారులు బిల్లులు ఇవ్వడం లేదని మానసిక ఆందోళనలతోనే మధుసూదన్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం మధుసూదన్ ఇంటికి వచ్చిన వర్సిటీ ఉన్నతాధికారులు ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. వర్సిటీ నుంచి మధుసూదన్‌కు రావాల్సిన డబ్బులను వెంటనే ఇప్పిస్తామని హామీఇచ్చారు. అయితే కుటుంబసభ్యులు తమకు స్పష్టమైన లిఖిత పూర్వకమైన హామీ కావాలని వర్సిటీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఒకటి., రెండు రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అయినా సంతృప్తి చెందక మధుసూదన్ మృతదేహాన్ని వర్సిటీ పరిపాలన భవనం ఎదుట ఉంచి నిరసన ఆందోళన చేసేందుకు వర్సిటీకి తరలించారు. అయితే పోలీసులు వెంటనే అప్రమత్తమై మృతదేహాన్ని వర్సిటీలోనికి తీసుకురాకుండా మొదటి గేటువద్ద అడ్డుకున్నారు. ఈ క్రమంలో మృతుడి బంధువులకు, పోలీసులతో వాగ్వాదం జరిగింది. చివరకు మధుసూదన్ మృతదేహంతో పరిపాలన భవనం ఎదుట నిరసనలకు దిగారు. దీంతో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు రంగంలోకి దిగారు. మధుసూదన్‌కు రావాల్సిన డబ్బులన్ని వెంటనే చెల్లిస్తామని ఫోన్‌లో కుటుంబసభ్యులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. మధుసూదన్ వైద్య ఖర్చుల కోసం ఇటీవల రూ.3 లక్షలు చెల్లించామని, మిగతా డబ్బులు సోమవారం చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సందర్శించిన తోటి ఉద్యోగులు

మధుసూదన్ మృతి విషయం తెలుసుకున్న తోటి ఉద్యోగులు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నేతలు, వర్సిటీ కాంట్రాక్టు, పార్టుటైం అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు భారీగా తరలి వచ్చారు. అనంతరం పోచమ్మకుంటలోని హిందూ స్మశాన వాటికలో మధుసూదన్ అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, మృతుడికి భార్య కోమల, కూతురు మనస్విని, కొడుకు తేజలున్నారు.


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వర్సిటీ అధికారులు తాళ్లపల్లి మనోహర్, ప్రొఫెసర్ మల్లారెడ్డి తదితరులు


హనుమకొండలో జరిగిన ముగ్గుల పోటీలో ముగ్గులను పరిశీలిస్తున్న మహిళా పోలీసు అధికారులు, ఆంధ్రజ్యోతి సిబ్బంది

అలరించిన రంగవల్లులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో విజయవంతంగా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలు


మహబూబాబాద్‌లో కెనరా బ్యాంక్ మేనేజర్ శోభన్‌కు మెమోంటో అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్


మహబూబాబాద్‌లో లోగో ముగ్గులు వేసిన చిన్నారి సరెడ్డి సాయి స్ఫూర్తికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్


వరంగల్‌లోని ఏవీవీ కళాశాలలో ముగ్గులను పరిశీలిస్తున్న కార్పొరేటర్లు


వరంగల్‌లోని ఏవీవీ కళాశాలలో ముగ్గులను పరిశీలిస్తున్న పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా


జనగామలో ముగ్గులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఆయన సతీమణి


జనగామలో లోకల్ స్పాన్సర్ 'శ్రీలక్ష్మీ షాపింగ్ మాల్' అధినేత భోగ కైలాసంను సత్కరిస్తున్న ఆంధ్రజ్యోతి బృందం


హనుమకొండలోని ముగ్గుల పోటీలో పాల్గొన్న చిన్నారులకు డిక్షనరీలను అందచేస్తున్న విక్రమ్ పబ్లిషర్ ప్రతినిధి శ్రీనివాస్


హనుమకొండలోని ముగ్గులో పోటీలో ప్రసంగిస్తున్న జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్


హనుమకొండలోని ముగ్గుల పోటీలో పాల్గొని ముగ్గులు వేస్తున్న చిన్నారులు


హనుమకొండలో మాట్లాడుతున్న కాజీపేట ట్రాఫిక్ సీఐ సుజాత


ములుగులో జరిగిన ముగ్గుల పోటీల సందర్భంగా మాట్లాడుతున్న మంత్రి సీతక్క


ములుగులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు


హనుమకొండలో జరిగిన ముగ్గుల పోటీల బహుమతి ప్రదానోత్సవంలో ప్రసంగిస్తున్న ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ వి.రఘుపతిరావు



మాట్లాడుతున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్



మానుకోటలోని సమైక్య జూనియర్ కళాశాలలో ముగ్గులు వేస్తున్న మహిళలు



ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్-ఉమా దంపతులకు మెమోంటోను అందజేస్తున్న 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి బృందం

తారే జమీన్ పర్..

(3వ పేజీ తరువాయి)

దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడుతాయని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొన్న మహిళలను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మురళీనాయక్-ఉమ దంపతులను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి బృందం శాలువాలతో సత్కరించి మెమోంటోను అందజేశారు.

ముందే సంక్రాంతిని తలపించిన..

'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు నిర్ణీత సమయం 9.20 గంటలకు ప్రారంభం కాగా 11.20 గంటల వరకు కొనసాగాయి. రెండు గంటలపాటు ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగిన ఈ పోటీల్లో అందరు ఆకర్షణీయమైన ముగ్గులు వేసి, గట్టిపోటీ ఇవ్వడంతో విజేతలను ఎంపిక చేయడం న్యాయనిర్ణేతలకు సవాల్‌గా మారింది. విజేతలను ప్రకటించేంత వరకు కళాశాల ప్రాంగణమంతా ఎవ్వరూ గెలుపొందుతారనే ఉత్కంఠత నెలకొంది. మొత్తానికి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సమైక్య జూనియర్ కళాశాల ఆవరణమంతా సంక్రాంతి శోభను తలపించింది. జిల్లా స్టాఫర్ నవాబ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్క్యులేషన్ జిల్లా ఇన్‌చార్జి గోపాల్, ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ప్రతినిధులు కట్ల రాజు, ఆమెడ శ్రీధర్, వెల్పుల రాజమల్లు యాదవ్, భర్తపురపు వెంకన్న, రామకృష్ణారెడ్డి, తేజావత్ రవి, గుర్రపు యాకాంబ్రం, నిమ్మల వినీత్, కుమార్, శ్రీను, బోనగిరి ప్రసాద్, బూర్ల ఉపేందర్‌గౌడ్, నాగులపాటి ఉమాకర్, నరెడ్డి రామలింగారెడ్డి, టీఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, సమైక్య కళాశాల అధ్యాపకులు నాగరాజు, సంపత్, సాంబయ్య, రాజు, భాస్కర్, సుమన్, సిబ్బంది నాగయ్య చారి పాల్గొన్నారు.



కన్సోలేషన్ బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, దాత శ్రీబాలాజీ క్లాత్ స్టోర్స్ యజమాని బొడ్ల శ్రీపాల్-పావని దంపతులు



టి.విజితకు రూ.4 వేల నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే, దాత సమైక్య విద్యాసంస్థల కరస్పాండెంట్ అడ్డగోడ కల్పన-నరేష్ దంపతులు



ఎం.విజయలక్ష్మీకి రూ.3 వేల నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే, దాత సమైక్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కమటం రమేష్-విజయ దంపతులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న వాసవిక్లబ్ నూతన కార్యవర్గం

సేవకు మారుపేరుగా నిలువాలి : ఎమ్మెల్యే

తొర్రూరు రూరల్, జనవరి 7 : సమాజంలో శాశ్వతమైన సేవా కార్యక్రమాలు చేస్తూ సేవకు మారుపేరుగా వాసవిక్లబ్ నిలువాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. ఆదివారం వెల్లికట్టి గ్రామశివారులో ఏర్పాటు చేసిన వాసవి క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పాస్ట్ ప్రెసిడెంట్ యాద నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆర్య వైశ్యులు సామూహిక శక్తికి, సేవకు క్లబ్ దోహదపడుతుందన్నారు. సేవలను విస్తరించాలని 8 క్లబ్‌ను నియమించడం అభినందనీయ మన్నారు. 2024-25 వాసవి క్లబ్ నూతన అధ్యక్షుడిగా బిజ్జాల అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా చౌడవరపు రాము, కోశాధికారిగా వల్లపు మధుతోపాటు కేసీజీఎఫ్ అధ్యక్షుడిగా మచ్చ సురేష్, ప్రధాన కార్యదర్శిగా విశ్వప్రకాష్, కోశాధికారిగా రేపూరి శ్రీనివాస్‌తో పాటు వివిధ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ గంప సాంబమూర్తి, వైస్‌గవర్నర్‌గా గార్లపాటి శ్రీనివాసులు, జాయింట్ సెక్రెటరీగా మోహన్‌రావు మహబూబాబాద్ డిస్ట్రిక్ ఇన్‌చార్జి, రీజియన్ చైర్మన్ పొద్దుటూరి గౌరిశంకర్‌తో పాటు మునిసిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, వైస్‌ఎంపీపీ ఇట్టి శ్యాంసుందర్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాల వేలం

తొర్రూరు రూరల్, జనవరి 7 : తొర్రూరు ఎక్సైజ్ పరిధిలో వివిధ నేరాలపై పట్టుబడిన వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు తొర్రూరు ఎక్సైజ్ సీఐ భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొర్రూరు ఎక్సైజ్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా బెల్లం, గుండుంబా తరలిస్తూ పట్టుబడిన వాహనాలను జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 10న (బుధవారం) వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

మహబూబాబాద్ రూరల్, జనవరి7 : జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం (నేడు) మధ్యాహ్నం 2.30 గంటలకు జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని చెప్పారు. జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

జీటీఏ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

వరంగల్ సిటీ, జనవరి 7 : ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం(జీటీఏ) రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఆదివారం హైదరాబాద్ మౌలాలిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చెన్నూరి వెంకట విక్రమాదిత్య ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, రాష్ట్ర అధ్యక్షుడిగా కాసం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా మేరోజు బ్రహ్మచారి, గౌరవాధ్యక్షుడిగా విశ్వనాథంగుప్త, అసోసియేట్ అధ్యక్షుడిగా తాళ్లపెల్లి ప్రకాశ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా అద్దంకి బుచ్చిరాములు, కోశాధికారిగా సపావట్ నర్సింహా, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సక్రునాయక్‌ను ఎన్నుకున్నారు.

కర్ణాటక డిప్యూటీ సీఎంను కలిసిన వెంకన్న

గూడూరు, జనవరి 7 : కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే.శివకుమార్‌ను ఆదివారం గూడూరు మండలం మర్రిమిట్ట గ్రామానికి చెందిన ఎట్టి వెంకన్న మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బొకే అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. మహబూబాబాద్ ఎంపీ స్థానం తనకు కేటాయించే విధంగా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో అత్యధికంగా ఆదివాసీలు ఉన్నారని, తనకు సీటు కేటాయిస్తే తప్పకుండా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

గూడూరులో బస్సును ఢీకొట్టిన లారీ



గూడూరులో బస్సును ఢీకొట్టిన లారీ

గూడూరు, జనవరి 7 : మండల కేంద్రంలోని జాతీయ రహదారి 365పై ఆదివారం నర్సంపేట నుంచి మహబూబాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సును మహబూబాబాద్ నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న లారీ స్వల్పంగా ఢీకొట్టింది. గూడూరు బస్టాండ్ సమీపంలో రోడ్డు క్రాస్‌గా ఉండడం వలన మహబూబాబాద్ వైపునకు వస్తున్న బస్సును నర్సంపేట వైపు వెళ్తున్న లారీ స్వల్పంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు.

'అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 7 : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే భూక్య ఉమామురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జిల్లా విశ్వకర్మ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వివేడబ్ల్యూఏ జిల్లా అధ్యక్షుడు ఓంకార్, చెన్నోజు విజయ్‌కుమార్, ఉల్లి విద్యాసాగర్, తేలుకుంట్ల ఉపేంద్రాచారి, వలబోజు సోమయ్య, ఎర్రోజు లక్ష్మణాచార్యులు, సోమ నర్సయ్య, తేలుకుంట్ల సునిత, రమాదేవి, సజ్జనపు వెంకటేశ్వర్లు, సోమేశ్వర్, యాకాంబ్రాచారి, రామారావు, వెంకటేశ్వర్లు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి..

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడామైదానంలో మానుకోట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి బాల, బాలికల కబడ్డీ ఎంపిక పోటీలను ప్రారంభించారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారని అసోసియేషన్ బాధ్యులు మద్ది వెంకటరెడ్డి తెలిపారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రాష్ట్రస్థాయికి ఎంపికైన బాల, బాలికల జట్లు ఈనెల 11 నుంచి 14 వరకు సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్‌లో జరిగే 49వ తెలంగాణ రాష్ట్రస్థాయి కబడ్డీ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికల్లో అసోసియేషన్ బాధ్యులు తోట సురేష్, సంద వీరన్న, గందసిరి శ్రీనివాస్, బానోతు చాంప్లానాయక్, గాడిపెల్లి సతీష్, తోట యాకాంబ్రం, వ్యాయామఉపాధ్యాయులు ఇమామ్, వసంత, విజేత, జ్యోతి, నాగమణి పాల్గొన్నారు.

జర్పుల తండాలో బీఆర్ఎస్ నాయకుల నిరసన



జర్పులతండాలో శవయాత్రను నిర్వహిస్తున్న గిరిజనులు

మరిపెడ రూరల్, జనవరి 7 : జర్పులతండా గ్రామపంచాయతీ గుర్తింపును రద్దు చేయించారని ఆరోపిస్తూ ఆదివారం బీఆర్ఎస్ నాయకులు జర్పుల ఉపేందర్‌నాయక్, కేల్యానాయక్, శ్రీను, వెంకన్న, రాంకిషన్, లోక్యానాయక్.. అదే పార్టీకి చెందిన ఓ నేత బొమ్మతో శవయాత్ర నిర్వహించి, దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 వందల జనాభా దాటిన తండాను గ్రామ పంచాయతీలుగా చేస్తామంటూ అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారన్నారు. జర్పుల తండాలో వెయ్యి జనాభా, 650 ఓట్లు ఉన్నాయన్నారు. అయితే 2023 అక్టోబరు నెలలోనే జర్పులతండా, సీరోలు మండలంలో ఓ తండాను జీపీలుగా చేశారని వారు వివరించారు. నవంబరులో జర్పుల తండా గ్రామపంచాయతీని రద్దు చేస్తూ.. ఎల్లారిగూడెంను గ్రామ పంచాయతీగా చేశారన్నారు. జర్పుల తండాలోనే సుమారు 3 వందల ఓట్లు ఎల్లారిగూడెంలో బీచ్‌రాజ్‌పల్లికి చెందిన ఓ బీఆర్ఎస్ నేత కలిపివేశారని ఆరోపించారు. అందుకే జర్పులతండా జీపీని ఆ గ్రామ బీఆర్ఎస్ నాయకులే రద్దు చేయించారని ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న వారు శనివారం హైదరాబాద్‌కు వెళ్లి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్‌ను కలిసిమొరపెట్టుకున్నారు. వెంటనే రామచంద్రునాయక్ సీఎం రేవంత్‌రెడ్డికి ఈ విషయం చెప్పారన్నారు. వెంటనే సీఎం స్పందించి జర్పుల తండాను గ్రామ పంచాయతీగా చేస్తానని హామీ ఇచ్చారనన్నారు.

ఇఫ్టూ మహాసభలను జయప్రదం చేయాలి

- జిల్లా అధ్యక్షుడు రవి

మహబూబాబాద్ రూరల్, జనవరి 7 : తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) అనుబంధ రాష్ట్ర ప్రథమ మహాసభలను వనపర్తి జిల్లా కేంద్రంలో ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు భారత కార్మిక సంఘాల సమైక్య జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మహాసభల విజయవంతం కోసం ముద్రించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఆరోగ్యంగా ఉండడానికి గ్రామపంచాయతీ వర్కర్స్ ఎంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, సోమనర్సయ్య, బాలయ్య, ప్రమోద్, బీకు తదితరులు పాల్గొన్నారు.

'నామినేటెడ్ పదవులు కేటాయించాలి'

మహబూబాబాద్ టౌన్, జనవరి 7 : తెలంగాణ ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులు కేటాయించాలని లెంగాణ ఉద్యమనేత, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామరాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు ఆదివారం వినతిపత్రాన్ని అందించారు. కమ్మగాని కృష్ణమూర్తి, సిరిపురం వీరన్న, గుంజె హన్మంతు, నారాయణసింగ్, గంగాధరి బాలరాజు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ తండాలో అన్నదానం

కేసముద్రం, జనవరి 7 : మండలంలోని ధన్నసరి సబ్‌స్టేషన్‌తండాలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కొడకండ్ల సరోజినీదేవి, ప్రభాకర్ వారి కుమారుడైన సంతోష్ జ్ఞాపకార్థం అన్నదానాన్ని చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ వెంకన్న, క్లబ్ అధ్యక్షుడు బెజ్జం ప్రేమ్‌కుమార్, కార్యదర్శి పరాంకుశం శ్రీహరి, పాస్ట్ జడ్‌సీ యర్నం శ్రీరాములు, మడిపెద్ది వెంకటేష్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే సాయం

కేసముద్రం, జనవరి 7 : కేసముద్రం విలేజి చైతన్యనగర్ కాలనీలో ఇటీవలె మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త జిలుకర అశోక్ కుటుంబానికి ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ సౌజన్యంతో రూ.5వేల ఆర్థిక సహాయాన్ని గ్రామ పార్టీ అధ్యక్షుడు పొలెపల్లి వెంకట్‌రెడ్డి, కార్యకర్తలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంకెపల్లి నారాయణరెడ్డి, కాటం రాంరెడ్డి, వేముల శ్రీనివాస్‌రెడ్డి, కొమ్ము శ్రావణ్, కునుకుల రాంబాబు, అల్లి అశోక్, మడిపల్లి కృష్ణమూర్తి, కొంతం కోటేశ్వర్, గుండు గోపాల్, కొమ్ము వెంకన్న పాల్గొన్నారు.

ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో..

ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేకల వీరన్నయాదవ్, కార్యకర్తలు కలిసి 50 కిలోల బియ్యం, రూ.3 వేల నగదు సహాయాన్ని అశోక్ కుటుంబానికి అందించారు. కీర్తి సురేందర్, మాసాడి శ్రీనివాస్, చిట్ల సంపత్, భైరు వెంకన్న పాల్గొన్నారు.

సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ 50 కిలోల బియ్యం, నెలకు సరిపోవు సరుకులను అశోక్ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సామల నర్సయ్య, వల్లందాస్ రవి, కొమ్ము రాహుల్ పాల్గొన్నారు.

కేపీఎల్-6 పోటీల ప్రారంభం

కేసముద్రం, జనవరి 7 : 'కేసముద్రం ప్రీమియర్ లీగ్-6' ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, మాజీ సొసైటీ చైర్మన్ బండారు వెంకన్న కేసముద్రంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాల్లో మాదిరిగానే క్రీడల్లోనూ గెలుపు ఓటములు సహజమని అందరూ స్ఫూర్తితో ఆడాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడువోలం రమేష్, పట్టణ అధ్యక్షుడు రావుల మురళి, అల్లం గణేష్, తరాల సుధాకర్, ఫయాజ్, సుమన్, విక్కి, లక్ష్మణ్, అఖిల్, అరుణ్, పాణి, మహేష్, సమీర్, అభి, పలుస యశ్వంత్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

మహబూబాబాద్ రూరల్, జనవరి 7 : మహబూబాబాద్ రూరల్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన దీపిక రెడ్డిని ఆదివారం బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు నలమాస సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంజాల శ్రీనివాస్, వీరేందర్, కొమ్ము రాజు, సంజీవ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



డోర్నకల్ జడ్పీహైస్కూల్లో 990-91 టెన్త్‌బ్యాచ్ పూర్వ విద్యార్థులు

డోర్నకల్, జనవరి 7 : డోర్నకల్ జడ్పీహైస్కూల్లో 1990-91 సంవత్సరంలో విద్యనభ్యసించిన పదో తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కొత్త రాంబాబు, సంద్రగిరి కృష్ణమూర్తి, శ్రీనివాస్, రామకృష్ణ, నాగలక్ష్మి, భాస్కర్, రాంచందర్, వెంపటి సీతారాములు, వెంకట్రాం, యూసుఫ్ పాల్గొన్నారు.

'వీరభద్ర స్వామి దేవాలయం చైర్మన్‌గా అవకాశం కల్పించండి'

కురవి, జనవరి 7 : కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ దరావత్ వీరన్ననాయక్ డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ జాటోతు రాంచంద్రునాయక్‌కు ఆదివారం విజ్ఞప్తి చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున విస్తృతంగా ప్రచారం చేసి గెలుపుకు కృషి చేశానని చెప్పారు. దీనికి తోడు అనేక సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నానని వెల్లడించారు. తనకు దేవాలయ చైర్మన్‌గా అవకాశం కల్పిస్తే ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

అయోధ్యరాముని అక్షింతల శోభాయాత్ర

బయ్యారం, జనవరి 7 : ఈనెల 22న అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం, సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొని బయ్యారంలో ఆదివారం అయోధ్య రాముని అక్షింత శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక రామాలయం నుంచి బస్టాండ్, గాంధీ సెంటర్, శివాలయం మీదుగా యాత్ర నిర్వహించారు. భక్తులు అయోధ్యరాముని అక్షింతల, కలశాలను శిరస్సుపై ధరించి ఊరేగింపు జరిపారు. గోపయ్య, హన్మంత్‌ప్రసాద్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలో తిరుమలేష్‌కు కాంస్య పతకం

దంతాలపల్లి, జనవరి 7 : బీహార్ రాష్ట్రంలో ఈనెల 3, 4న జరిగిన సెపక్ తక్రా జాతీయస్థాయి క్రీడా పోటీల్లో మండలంలోని దాట్ల ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.తిరుమలేష్ కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. దీంతో దాట్ల సర్పంచ్ కొమ్మినేని రవీందర్ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. జాతీయస్థాయిలో తెలంగాణ రాష్ట్రం నుంచి సెపక్ తక్రా క్రీడల్లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తొర్రూరులో డివిజన్‌స్థాయి నుంచి ఎంపికైన తిరుమలేష్‌ను రూ.3వేల నగదుతో ఘనంగా సత్కరించామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.సంజయ్‌కుమార్ మాట్లాడుతూ జనవరి 3వ తేదీ నుంచి 6వరకు బీహార్ రాష్ట్రంలోని పాట్నలో జరిగిన జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలువడం గర్వించదగిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి తిరుమలేష్‌కు ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు ఘనంగా అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయి క్రికెట్‌కు గురుకుల విద్యార్థిని

కేసముద్రం, జనవరి 7 : గుజరాత్‌లో ఈనెల 12 నుంచి నిర్వహించే ఎస్‌జీఎఫ్‌ఐ జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు కేసముద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని జి.మోహనశ్రీ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జె.స్వప్న ఆదివారం తెలిపారు. వనపర్తిలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఈ విద్యార్థినీ ఇటీవలె హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థిని ఎంపిక పట్ల కళాశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు శ్రీజ ఎంపిక

ఇనుగుర్తి, జనవరి 7 : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు చిన్నముప్పారం గ్రామానికి చెందిన దర్శనం శ్రీజ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సీహెచ్.వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ జిల్లాలోని ధర్మకంచలో శుక్రవారం నిర్వహించిన బాలబాలికల కబడ్డీ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు శ్రీజ ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 16, 17, 18 తేదీల్లో జనగామలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్ పోటీల్లో శ్రీజ పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన శ్రీజను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో రవీందర్, సత్యనారాయణ, కుమారస్వామి, విజయకుమార్, సోమయ్య, రమేష్, నరేష్, రాందాస్, పీఈటీ బిక్షపతి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రభుత్వ స్కూల్ విద్యార్థినుల ప్రతిభ

గూడూరు, జనవరి 7 : వరంగల్‌లో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో గూడూరు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభను చాటారు. శ్రావణి, శిరీష, సౌజన్య, దివ్యలు నాలుగు వెండి పతకాలు, తేజస్విని, రేణుక, జోత్స్న, సునీతలు నాలుగు కాంస్య పతకాలను సాధించారు. ఇందుకు గాను పాఠశాల హెచ్ఎం సుజాత, పీఈటీ భారతి, సీఆర్పీ శోభన్‌రెడ్డిలు విద్యార్థినులను అభినందించారు.

రెండు ఉమ్మడి జిల్లాలస్థాయి కబడ్డీ టోర్నీ

కురవి, జనవరి 7 : కురవి మండలం బలపాలలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలస్థాయి కబడ్డీ టోర్నీని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అరుణ్‌కుమార్, గోపి, శ్రీనివాస్ తెలిపారు. జనవరి 10వ తేదీ నుంచి 12 వరకు నిర్వహిస్తున్న ఈ క్రీడల్లో మొదటి బహుమతి గెలుచుకున్న జట్టుకు రూ.30 వేలు, ద్వితీయ బహుమతికి రూ.20 వేలు, తృతీయ బహుమతికి రూ.15 వేలు, నాల్గవ బహుమతికి రూ.10 వేలు ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు తెలిపారు. బలపాల జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణంలో క్రీడలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు సెల్ : 93467 00431, 96528 24228 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు కురవి మండల సభ

కురవి, జనవరి 7 : మండల సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సరస్వతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ హాజరవుతున్నారని వెల్లడించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

యాకమ్మకు వెంకటసుబ్బు అవార్డు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 7 : జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, కవి, రచయిత్రి డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మకు వెంకటసుబ్బు మెమోరియల్ అవార్డును అందజేశారు. హైదరాబాద్‌లోని ప్రముఖ రచయిత్రి అల్లాడి ఉమాదేవి నివాసంలో ఆదివారం తన అమ్మమ్మ వెంకటసుబ్బు అవార్డు 2024 సంవత్సరానికి డాక్టర్ యాకమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం తన అమ్మమ్మ పేరుమీద ఇచ్చే వెంకటసుబ్బు అవార్డును డాక్టర్ యాకమ్మకు అందజేసి ఘనంగా సన్మానించారు. ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా, రచయిత అఫ్సర్, రచయిత్రి రెంటాల కల్పన, సుభద్ర పాల్గొన్నారు.

16 క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం

కురవి, జనవరి 7 : సూదనపల్లి, కందికొండ శివారులో అక్రమంగా తరలిస్తున్న 16 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కేజీల పటికను స్వాధీనం చేసుకున్నట్లు సీరోలు ఎస్సై విజయ్ రాంకుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అటువైపుగా వస్తున్న అనుమానస్పదంగా కన్పించిన ట్రాక్టర్‌ను తనిఖీ చేయగా, అందులో 16 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కేజీల పట్టికను గుర్తించినట్లు చెప్పారు. వాటిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. రవాణాకు ఉపయోగించిన ట్రాక్టర్, ఓ ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశామని పేర్కొన్నారు.

రేపు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

డోర్నకల్, జనవరి 7 : మండల కేంద్రంలోని జైన్‌భవన్‌లో 9న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కాల సుమీర్ చంద్‌జైన్ తెలిపారు. ఈ సమావేశానికి ప్రభుత్వవిప్, స్థానిక ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యకర్తలు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు